క్లుప్తంగా

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం


రాట ముహూర్తం చేస్తున్న కమిటీ సభ్యులు

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలోని మంచి నీటి చెరువు వద్ద గల దుర్గాదేవి ఆలయంలో దేవీ నవరాత్ర ఉత్సవాలకు శుక్రవారం రాట ముహూర్తం చేశారు. ఈ సందర్భంగా అర్చకుడు సాయి శంకర్ శర్మ మాట్లాడుతూ గ్రామానికి చెందిన పడాల కుమార్ రెడ్డి, విజయలక్ష్మి దంపతులు కర్తలుగా వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాబ్ కార్డుల పంపిణీ


కొంకుదురులో జాబ్ కార్డు అందిస్తున్న సర్పంచ్ వీరమణి తదితరులు

బిక్కవోలు: కొంకుదురు పంచాయతీ వద్ద శుక్రవారం ఉపాధి హామీ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గతేడాది జరిగిన పనులు వివరాలు వినిపించారు. సర్పంచ్ వీరమణి మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఉపాధిహామీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి జాబ్ కార్డులు అందించారు. కార్యక్రమంలోని ఎంపీటీసీ కొంకుదురు పీపీ, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, చిన్నం వీరభద్రరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కర్రి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

హిజ్రాపై కేసు నమోదు

రంగంపేట: హిజ్రాపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తోట కృష్ణసాయి తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ గురువారం అర్ధరాత్రి తన సిబ్బందితో కలిసి గస్తీ నిర్వహిస్తుండగా రాజమహేంద్రవరానికి చెందిన హిజ్రా కనిపించడంతో ప్రశ్నించామన్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ప్రోగ్రాం చేయడానికి వచ్చినట్టు చెప్పడంతో కేసు నమోదు చేసి పెద్దాపురం కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు. వినాయక నిమజ్జనం పేరుతో అసాంఘిక కార్యక్రమాలు, అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పౌష్టికాహారంపై అవగాహన

పెదపూడి: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సంపర సెక్టార్ సూపర్ వైజర్ పద్మావతి అన్నారు. శహపురం గ్రామంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లులు తీసుకోవాల్సిన సమతుల్య ఆహారం, తల్లులు పాలిచ్చే పద్ధతులను వివరించారు. అలాగే స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలు, మహిళల చట్టాలపై ఏ విధంగా రక్షణ పొందాలనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పెదపూడి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని విశ్వమానవతా సంస్థ వ్యవస్థాపకుడు అల్లూరి శ్రీనివాస్ చౌదరి అన్నారు. అనపర్తి మండలం మహేంద్రవాడ ఎంపీపీ యూపీ స్కూల్లో శుక్రవారం విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శారీరంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే యోగా తప్పనిసరిగా చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో యోగా చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శేషుకుమార్, ఉపాధ్యాయులు జి.మునిరెడ్డి, తాడి గణపతి, కృపానందం పాల్గొన్నారు.

28న గుర్రం జాషువా జయంతి

మధురపూడి: కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత, పద్మభూషణ్ గుర్రం జాషువా 129వ జయంతిని ఈ నెల 28న ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు విజయ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ సమీపంలోని అంబేడ్కర్ కాంస్యం విగ్రహం వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కవులు, కళాకారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

అందరి ఆరోగ్యమే ప్రభుత్వాల లక్ష్యం

పెదపూడి: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా అందరికీ ఆరోగ్యం అందించాలనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు పెదపూడి శుక్రవారం పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, మాజీ సొసైటీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, మాజీ ఎంపీపీ జుత్తుక సూర్యకుమారి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ ఆరుమిల్లి అమ్మన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు. అలాగే దోమాడలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి పోస్టర్లు పంపిణీ చేశారు.

అయ్యో రామ.. మరచారమ్మా..

- హామీలను విస్మరించిన కూటమి ఎమ్మెల్యేలు
- సమస్యలకు లభించని పరిష్కారం
- అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి


కోరుకొండలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం

రాజానగరం: చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోని వంద రోజులు పూర్తయ్యాయి. దీంతో కూటమిలోని పార్టీల నాయకులు సంబరాలు చేసుకుంటున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ప్రజలకు ఏమి పాలుపోవడం లేదు. ఎన్నికల సమయంలో వివిధ సమస్యలను పరిష్కరిస్తామంటూ ప్రకటనలు చేసిన కూటమి ఎమ్మెల్యేలు ఇప్పుడు నోరు మెదపడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు అమలవుతాయో చెప్పడం లేదు. దీంతో ప్రజలు విస్తుబోతున్నారు. రాజానగరం ఎమ్మెల్యేగా జనసేన పార్టీకి చెందిన బత్తుల బలరామకృష్ణ, అనపర్తి ఎమ్మెల్యేగా బీజేపీకి చెందిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం సాధించారు. కూటమికి చెందిన వారిద్దరూ ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చారు. అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరిస్తామని హామీలు గుప్పించారు. వారు అధికారం చేపట్టి వంద రోజులు అవుతున్నా వాటివైపు కన్నెత్తి చూడడం లేదు.

రాజానగరం నియోజకవర్గంలో..

నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలో బత్తుల బలరామకృష్ణ అనేక హామీలు గుప్పించారు. నియోజకవర్గాన్ని ఇండస్ట్రీయల్ హబ్‌గా తీర్చిదిద్దుతానన్నారు. కానీ ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ఆ దిశగా ప్రయత్నించిన జాడ కూడా లేదు. గత ప్రభుత్వంలో కలవచర్లలో సుమారు 110 ఎకరాల విస్తీర్ణంలో ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటుకు నాటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా భూమి పూజ చేశారు. ఆపై గెలిచిన ఎమ్మెల్యే ఇంతవరకు ఆ వైపునకు చూసింది కూడా లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో మంజూరైన ఇండస్ట్రియల్ పార్కునే పట్టించుకోని వ్యక్తి ఇక నియోజకవర్గాన్నంతటినీ ఇండస్ట్రియల్ హబ్ మార్చేస్తానంటే నమ్మి మోసపోయామని నిరుద్యోగ యువత వాపోతుంది.

● ఇసుకను తోడేస్తున్నారు

సీతానగరం ఏటిపట్టు నుంచి గోదావరి ఇసుక దూర ప్రాంతాలకు తరలిపోతుందని, తాను ఎమ్మెల్యే అయితే ఇటువంటి అక్రమాలను నిరోధించి, గోదావరి ఇసుకను రేవుల నుంచి పేదలకు ఉచితంగా అందిస్తానంటూ నేటి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఇచ్చిన హామీ ఏమైందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఇసుక నిల్వలు ఎక్కడ ఉన్నాయో చూసి, వాటిని స్వాహా చేయడంలో చొరవ చూపారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ 'ఇసుక నిల్వలలో దొంగలు పడ్డారు' అంటూ టీడీపీ కరపత్రికలోనే వార్తలు రావడం చూస్తుంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

● రైతులకు పరిహారం ఊసేలేదు

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి సంబంధించిన రైతులకు ప్రభుత్వం నుంచి సుమారు రూ.20 కోట్ల వరకూ పరిహారం అందాల్సి ఉంది. ఈ విషయంపై ప్రస్తుతం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ రైతులకు హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకూ ఒక్క రూపాయి పరిహారం రాలేదు.

● తాగునీటికి కష్టాలు

ప్రతి ఇంటికీ కుళాయిలను ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తామని ఎన్నికల సమయంలో బత్తుల బలరామకృష్ణ హామీ ఇచ్చారు. అది నేటికి కార్యచరణకు రాలేదు. అలాగే సత్యసాయి మంచినీటి పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు నెలల తరబడి చెల్లించకపోవడంతో ఆ పథకం ద్వారా నీటి సరఫరాలో సమస్యలు ఏర్పడుతున్నాయి.

● రివర్సు పంపింగ్ స్కీమ్ ఏమైంది

కోరుకొండ, సీతానగరం మండలాల పరిధిలోని 25 వేల ఎకరాల తరచుగా ముంపు బారిన పడుతుంటాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా గత ప్రభుత్వంలో రివర్సు పంపింగ్ స్కీమ్ ఏర్పాటుకు రూ.91 కోట్లు మంజూరు చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వంగానీ, సంబంధిత వ్యక్తులుగానీ ఈ పనులను ముందుకు తీసుకువెళ్లడం లేదు. అలాగే బొబ్బిల్లంక, జాలిమూడి మధ్యలో ఏటిగట్టు బలహీనంగా ఉంది. దానికి రక్షణ గోడను కట్టించవలసిన అవసరాన్ని గుర్తించిన నాటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రభుత్వానికి ఆ మేరకు ప్రతిపాదనలు పంపించారు. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం దృష్టికి ఈ విషయం ఇంతవరకు వెళ్లకపోవడం శోచనీయం.

● గోతులను పట్టించుకోరా..

రాజమహేంద్రవరం నుంచి సీతానగరం వెళ్లే మార్గాన్ని నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేస్తూ గత ప్రభుత్వ హయాంలో పనులు చేపట్టారు. ఎన్నికల సమయానికి అవి దాదాపు పూర్తయ్యాయి. కానీ రఘుదేవపురం నుంచి సీతానగరం వరకూ పనులు ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయాయి. ఆ సమయంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన నేటి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తాను ఎమ్మెల్యేగా గెలిస్తే తక్షణమే ఈ గోతులకు తాత్కాలికంగానైనా మరమ్మతులు చేయిస్తానంటూ మాటిచ్చారు. కానీ మర్చిపోయారు.

● ఈనాం భూముల సమస్య

కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంబంధించిన ఈనాం భూముల రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరించడంలో గత పాలకులు విఫలమయ్యారని, తాను అధికారంలోకి వస్తే వెంటనే ఈ సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానంటూ నేటి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హామీ ఇచ్చారు. ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు గానీ ఈ సమస్యకు మాత్రం నేటికీ మోక్షం కలగలేదు.

● డిగ్రీ కళాశాల మాటేమిటి

నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కళాశాల లేకపోవడాన్ని విడ్డూరమంటూ వ్యాఖ్యానించిన బత్తుల బలరామకృష్ణ.. తాను ఎమ్మెల్యేనైతే ఈ సమస్యను పరిష్కరిస్తానంటూ వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చాక ఆ విషయాన్నే మరచిపోయారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో భారీఎత్తున అవినీతి జరిగిందని, దానిపై విచారణ నిర్వహించి బట్టబయలు చేస్తానంటూ ప్రగల్భాలు పలికిన ఆయన ఆ తరువాత ఏమైందో ఏమోగాని, మిన్నకుండిపోయారు.

● అనేక సమస్యలు

శ్రీరంగపట్నం – మునగాల ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపిస్తానన్నారు. కానీ ప్రజలకు నేటికీ ఆ ముంపు బెడద తప్పడం లేదు. రైతులకు మెరుగైన సేవలందించి, రైతులకు అండగా నిలుస్తానన్నారు. ఎత్తిపోతల పథకాల నుంచి సకాలంలో గోదావరి జలాలను వదలక రైతులు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోలేదు.

అనపర్తి నియోజకవర్గంలో..

అనపర్తి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థిగా బీజేపీ నుంచి పోటీ చేసిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎన్నికల ప్రచారంలో అనేక హామీలు ఇచ్చారు. తాను అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరిస్తామని ప్రజలకు మాట ఇచ్చారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తు పెట్టుకుని ఆయనను గెలిపించారు. కానీ అధికారంలోకి వచ్చాక రామకృష్ణారెడ్డి మర్చిపోయారు.

● రోడ్డు అభివృద్ధి ఏమైంది

తాను అధికారంలోకి రాగానే అనపర్తి నుంచి పెదపర్తి, పేరా రామచంద్రపురం మీదుగా రాజానగరం వెళ్లే రోడ్డును అభివృద్ధి చేస్తానని రామకృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. కానీ అధికారం చేపట్టి వంద రోజులు అవుతున్నా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఇంత వరకూ ఆ రోడ్డుపై పడిన గోతులను కూడా పూడ్చించలేదు.

● రైలు ఆగుతుందా..

అనపర్తి రైల్వే స్టేషనులో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఆగేలా చూస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఏమైందో తెలియడం లేదు. ఎన్‌డీఏ ప్రభుత్వమే కేంద్రంలో అధికారంలో ఉన్నా రామకృష్ణారెడ్డి తన హామీని నెరవేర్చలేదు. ఆ రైలు ఎప్పుడు ఇక్కడ ఆగుతుందా అని అనపర్తి ప్రజలు ఎదురు చూస్తున్నాయి.

● ఫుట్‌పాత్ నిర్మిస్తారా..

అనపర్తిలో మూసివేసిన రైల్వే గేటు వద్ద ఫుట్‌పాత్ నిర్మిస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అది కూడా మిగిలిన హామీల మాదిరిగానే మారిపోయింది.

● మరమ్మత్తులు ఏవీ!

అనపర్తి నుంచి బిక్కవోలు వరకు కెనాల్ రోడ్డును ఆధునీకరిస్తామన్న హామీని మర్చిపోయారు. కనీసం ఆ రోడ్డుకు మరమ్మతులు కూడా జరగలేదు. హైవే రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామంటూ కాలయాపన చేస్తున్నారు.

● ఎత్తిపోతలు.. ఉట్టి కోతలు

చాగల్నాడు ఎత్తిపోతల పథకాన్ని అభివృద్ధి చేసి, ఆయకట్టు అంతటికీ నీరు అందిస్తామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. కానీ ఆ మాటను మరిచిపోయారు.

హామీల అమలులో విఫలం



ఎన్నికల సందర్భంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విఫలమయ్యారు. మెట్ట ప్రాంతమైన రాజానగరానికి సాగు, తాగునీరు ఇస్తానన్నారు. ప్రస్తుతం కోరుకొండ మండలంలోని గుమ్ములూరు. బూరుగుపూడి, మధురపూడి, కోటికేశవరం, కణుపూరు, రాజవరం గ్రామాలకు సాగునీటి ఎద్దడి ఏర్పడింది. పుష్కర కాలువ నీరు సరఫరా జరగకపోవడంతో పంట ఎండిపోతుంది. మూరుమూల గ్రామాలకు తాగునీటి సమస్యలున్నాయి. జాతీయ రహదారిని ఆనుకున్న బూరుగుపూడిలో కలుషిత నీరు సరఫరా అవుతుంది. – **కొండాడ చందు,** ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు, కోరుకొండ

బురద కాలువ ముంపు



కోరుకొండ మండలంలోని శ్రీరంగపట్నానికి బురద కాలువ ముంపు బెడద తప్పడం లేదు. సూరంపాలెం జలాశయం నుంచి మిగులు జలాలను విడిచిపెడితే గ్రామానికి ముంపు తప్పడం లేదు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చిన బత్తుల బలరామకృష్ణ..గెలిచిన తర్వాత విస్మరించారు. ఈ ఏడాది నాలుగు సార్లు వరద నీరు గ్రామాన్ని ముంచెత్తింది. బీసీ పేటలు పూర్తిగా నీట మునిగాయి. ఎస్సీపేట ముంపు బారిన పడింది. స్థానికులు అనారోగ్యం బారిన పడ్డారు. ఇక్కడ పశువైద్య శిబిరాన్ని నిర్వహించినప్పటికీ సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదు. – **తనకాల ప్రసాద్,** పీఏసీఎస్ మాజీ డైరెక్టర్, శ్రీరంగపట్నం


శ్రీరంగపట్నాన్ని ముంచెత్తిన బురద కాలువ


తొర్రిగెడ్డ కాలువ

బాల్యం నుంచే క్రీడలపై ఆసక్తి పెరగాలి

రంగంపేట: విద్యార్థులకు బాల్యం నుంచి క్రీడలపై ఆసక్తి పెంపొందించి జాతీయ స్థాయి క్రీడాకారులుగా తయారు చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తనకు నచ్చిన ఆటలో ప్రావీణ్యం, ప్రతిభ కనబరచడానికి నిరంతర సాధన చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా మండల స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ధ్రువపత్రాలు, పతకాలు అందించి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పెమ్మనబోయిడి బాల సరస్వతి, వర్షితను సత్కరించారు. క్రీడా పోటీలకు సహరించిన దాతలు, వ్యాయామ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని వ్యాయామ ఉపాధ్యాయులంతా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, మాజీ ఉప సర్పంచ్ పోతుల వీర సుందరరావు, మండల విద్యాశాఖాధికారి పి.మధుసూదనరావు పాల్గొన్నారు.


నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అమ్మవార్లకు అభిషేకాలు

పెదపూడి: సంపర గ్రామంలో కొలువైన విజయ దుర్గమ్మకు శుక్రవారం పంచామృతాభిషేకం చేశారు, అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో మంచినీటి చెరువు వద్ద కొలువైన విజయ దుర్గాంబిక అమ్మవారికి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నారాయణశర్మ తెల్లవారు జామునే అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

బిక్కవోలు: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన పందలపాక ఉన్నత పాఠశాల హెచ్ఎం చిర్ల శ్రీనివాస్‌రెడ్డి దంపతులను వైద్యులు ఘనంగా సత్కరించారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా రాయవరం చాణిక్య నర్సింగ్‌హోమ్ అధినేత డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి , పందలపాక సూరారెడ్డి నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ మల్లిడి కృష్ణారెడ్డి సత్కరించారు. కార్యక్రమంలోని సర్పంచ్ సబ్బారపు పద్మావతి, మాజీ సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, ఉప సర్పంచ్ పడాల వెంకటరామారెడ్డి, పేరెంట్స్ కమిటీ మాజీ చైర్మన్ గొలుగూరి నాగిరెడ్డి పాల్గొన్నారు.


శ్రీనివాస్‌రెడ్డి దంపతులను సత్కరిస్తున్న ప్రముఖులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సీతానగరం: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భావితరాలకు మంచి జరగాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా ఇనుగంటివారిపేట, సీతానగరం, పురుషోత్తపట్నం పంచాయతీ పరిధి రామచంద్రపురం గ్రామాలలో టీడీపీ ఇన్‌చార్జి వెంకటరమణ చౌదరితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ, మండల స్పెషల్ ఆఫీసర్ బి.రామ్ ప్రసాద్, ఎంపీడీవో కె.రమేష్, ఏపీవో నాగేశ్వేణి, టెక్నికల్ అసిస్టెంట్ వీరబాబు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వంద రోజులు పూర్తయిన సందర్భంగా రామచంద్రపురం, ఇనుగంటివారిపేటలలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


ఇనుగంటివారిపేటలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ, వెంకటరమణ చౌదరి

భారతదేశానికి ఎనలేని 'యువశక్తి'

- దేశాభివృద్ధిలో కీలకం కావాలి
- ఎంపీ పురందేశ్వరి
- 'నన్నయ' లో యువజనోత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

రాజానగరం: ప్రపంచంలో ఏ దేశానికి లేని విధంగా భారతావనికి ఎనలేని యువశక్తి ఉందని, దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర వహించాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో స్వామి వివేకానందుని జయంతిని పురస్కరించుకుని యువజన సర్వీసుల శాఖ, కాకినాడ సెట్రాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమాజంలో మార్పును తీసుకురావాలనే సంకల్పం, తపన యువతలో ఉండాలన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన దేశాన్ని ప్రపంచ స్థాయిలో అత్యున్నత శిఖరాలపై ఉంచేలా కృషి చేస్తున్నారన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ యువతలో మంచి నాయకత్వ లక్షణాలు ఉన్నప్పుడే విజయాలు సాధ్యమవుతాయన్నారు. యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత కీలకం కావాలన్నారు. సెప్ట్ రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్ కె.శారదదేవి మాట్లాడుతూ యువజనోత్సవాల సందర్భంగా ఈ ఏడాది జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయిలో సైన్స్ అండ్ టెక్నాలజీలకు ప్రాధాన్యతనిస్తూ యువజనోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. విజేతలను జిల్లా నుంచి రాష్ట్రం, అక్కడ నుంచి జాతీయ స్థాయికి పంపిస్తారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, కాకినాడ సెట్రాజ్ సీఈఓ కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా..

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలు అత్యంత ఉత్సాహభరితంగా, ఉల్లాసంగా సాగాయి. యువజన సర్వీసుల శాఖ, కాకినాడ సెట్రాజ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 'సైన్స్ అండ్ టెక్నాలజీలో ఆవిష్కరణ'లో జరిగిన పోటీలలో 1,369 మంది విద్యార్థులు తమలోని ప్రతిభను ప్రదర్శించే ప్రయత్నం చేశారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

విజేతలు వీరే..

సైన్స్ అండ్ టెక్నాలజీలో ఆవిష్కరణలో జె.దేశిక్ రాజారెడ్డి బృందం ప్రథమ, ఎల్.రత్నదీపు బృందం ద్వితీయ, సి.జాహ్నవి బృందం తృతీయ స్థానాల్లో నిలిచారు.

- జానపద నృత్యంలో పావని బృందం, మణిపూర్ కల్చర్ డ్యాన్స్, జయశ్రీ బృందం మొదటి మూడు స్థానాలు సాధించాయి.
- జానపద నృత్యం సోలో విభాగంలో బి.దీపిక, పి.సౌమ్య శ్రీజ, ఆర్.నవ్యతేజశ్రీ ప్రతిభ చూపారు.
- జానపద గేయాలు (బృందం) పోటీలో స్వాతి, బ్లేస్సీ, జేమ్ సి జోసెఫ్ బృందాలు ఆకట్టుకున్నాయి. సోలో విభాగంలో ఎస్.ఆసిక్, పి.రఘు, షేక్ అబ్రార్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.
- కథా రచనలో సీహెచ్.ప్రశాంతి, ఎన్.హేమమాలిని, ఎ.పావని, పెయింటింగ్‌లో కె.లాజరు, ఇ.సువర్ణజ్యోతి, జి.జీవన్ కుమార్, కవిత్వంలో కె.షెకినా గిడియోన్, ఎస్.హేమమాలిని, స్వర్ణలతా గోష్, ఉపన్యాసంలో ఇ.వికాస్ కుమార్, కె.షెకినా గిడియోన్, వై.ఉత్కళ, యువకృతిలో డి.వెంకట త్రివిక్రమ్, ఎన్.దుర్గాచక్ర శ్రావణి, బి.లక్ష్మీ సుప్రజా పార్వతి ప్రతిభ కనబరిచారు.

రుణాలను రీషెడ్యూల్ చేయకుండా మోసం

రాజానగరం: వ్యవసాయ రుణాలను రీషెడ్యూల్ చేయకుండా మోసం చేశారంటూ నందరాడ సొసైటీలోని అడబాల గణపతిరావు, నూనె వెంకన్న, అడబాల ఆదివిష్ణు, తాటికొండ రాంబాబు, కూరాకుల ధర్మరాజు, పల్లపు చక్రరావు, ఎ.పాండవులు, బత్తిన బాలాజీ తదితర రైతులు ఆరోపించారు. దీనిపై ఎంపీ పురందేశ్వరికి వినతిపత్రం అందజేశారు. సొసైటీ నుంచి వ్యవసాయ పనుల కోసం తీసుకున్న రుణాలకు మార్చి 31 నాటికి 7 శాతం వడ్డీ చెల్లించి, రీ షెడ్యూల్ చేయించుకుంటూ ఉంటామన్నారు. ఆ విధంగానే గత మార్చి, ఏప్రిల్ నెలలో 7 శాతం వడ్డీ చెల్లించి, రశీదులు తీసుకున్నాగానీ సిబ్బంది మాత్రం ఇంతవరకు తమ రుణాలను రీషెడ్యూల్ చేయకుండా మోసం చేశారన్నారు. ఇప్పుడు 13 శాతం వడ్డీ కట్టాలని నోటీసులిచ్చారని, సిబ్బంది నిర్లక్ష్యానికి తాము ఎందుకు బాధ్యత వహించాలన్నారు.

మా ఆత్మగౌరవాన్ని కించపర్చకండి

రాజానగరం: ప్రభుత్వం చేపట్టే ప్రతి పనికి క్షేత్రస్థాయిలో శక్తివంచన లేకుండా అంకిత భావంతో పనిచేస్తున్నామని, పనిభారం పెరుగుతున్నా భరిస్తున్నామని, ఇదే అదనుగా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా పనులు చేయమంటే తమ వల్ల కాదని గ్రామ సచివాలయ ఉద్యోగులు స్పష్టం చేశారు. గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం (జీఎస్‌డబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో వివిధ విభాగాల ఉద్యోగులందరూ శుక్రవారం రాజానగరం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఇంటింటికీ వెళ్లి 'ఇది మంచి ప్రభుత్వం' అనే స్టిక్కర్లను ఆయా ఇళ్లకు అతికించి, పోస్టర్లు అందజేయాలని చెప్పటాన్ని వారంతా వ్యతిరేకిస్తున్నారు. జాబ్‌చార్ట్ ప్రకారమే కాకుండా గతంలో వలంటీర్లు చేసే పలు రకాల పనులను ఇప్పటికే తమచేత చేయిస్తున్నారు.

ఉపాధ్యాయులతో సమాజ ప్రగతి

మధురపూడి: ఉపాధ్యాయులతోనే సమాజ ప్రగతి సాధ్యమవుతుందని కోరుకొండ ఎంఈఓ కుశలవ దొర అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డు గ్రహీతలను శుక్రవారం కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. వీరిలో ఐదుగురు జిల్లా స్థాయిలో, ఏడుగురు మండల స్థాయిలో అవార్డులు అందుకున్నారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న అధికారులు